క్లుప్తంగా

గంగూరులో డస్ట్‌బిన్ల పంపిణీ



పెనమలూరు: గంగూరులో తడి, పొడి చెత్త సేకరణకు ప్రతీ ఇంటికి రెండు చొప్పున డస్ట్ బిన్లు గురువారం పంపిణీ చేశారు. పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా గ్రామంలో జరిగిన కార్యక్రమంలో తడి, పొడి చెత్త సేకరణకు ఎంపీడీవో డాక్టర్ బండి ప్రణవి ప్రతీ ఇంటికి డస్ట్‌బిన్లు పంపిణీ చేశారు. గ్రామంలో పారిశుద్ధ్యం పరిరక్షణకు గ్రామస్తులు తమ వంతు సహాయ సహకారాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో ఉప ఎంపీడీవో శ్రీనివాసరావు, గ్రామ పంచాయతీ, సచివాలయం, అంగన్‌వాడీ, డ్వాక్రా, ఉపాధి పథకం సిబ్బంది, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు వస్త్రాల అందజేత



పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీ పరిధి యనమలకుదురులో పారిశుద్ధ్య పనులు చేసే కార్మికులకు దాత వెలగపూడి బాబూరావు గురువారం వస్త్రాలు పంపిణీ చేశారు. గ్రామంలో 51 మంది పారిశుద్ధ్య కార్మికులు పని చేస్తున్నారు. సచివాలయం వద్ద వారికి చీరలు, జాకెట్లు, షర్టులు, ప్యాంట్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు మాజీ ఉప సర్పంచి ముప్పవరపు నారాయణ, ధనేకుల శంకర్‌రావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

జాతీయ విపత్తు నిర్వహణపై శిక్షణ

పెనమలూరు: పెదపులిపాక గ్రామంలో గ్రామస్తులకు గురువారం జాతీయ విపత్తు నిర్వహణపై శిక్షణ ఇచ్చారు. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్(ఎన్‌ఐడీఎం) ఆధ్వర్యంలో జరిగిన శిక్షణ కార్యక్రమంలో విద్యార్థులు, గ్రామస్తులు, సచివాలయ సిబ్బందికి జాతీయ విపత్తుపై అవగాహన కల్పించారు. కృష్ణానదికి వరద వచ్చిన సమయంలో తీసుకోవాల్సిన ముందస్తు చర్యలు, పునరావాస కేంద్రాల ఏర్పాటు, బాధితులకు అందించే సహాయంపై ఎన్ఐడీఎం సిబ్బంది శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామసర్పంచి గుంటూరు శ్రీనివాసాచౌదరి, ఉప ఎంపీడీవో శ్రీనివాసరావు, గ్రామ పంచాయతీ కార్యదర్శి ఒగిరాల తిరుమల వెంకటరత్నం, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

7న ఉచిత వినికిడి మిషన్ల పంపిణీ

లబ్బీపేట(విజయవాడతూర్పు): అక్టోబరు 7న మంగళగిరిలో నిర్వహించే కార్యక్రమంలో 15 వేల మందికి వినికిడి మిషన్లు పంపిణీ చేయనున్నట్లు ఆర్పీఐ రాష్ట్ర అధ్యక్షుడు కొమ్మారెడ్డి బ్రహ్మానందరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి ఆర్పీఐ అధినేత, కేంద్రమంత్రి రామదాస్ అథావాలే పాల్గొంటారన్నారు. నగరంలోని తమ కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రామదాస్ అథవాలే అక్టోబర్ 5,6,7 తేదీల్లో రాష్ట్రంలో పర్యటిస్తారన్నారు. అందులో భాగంగా 5వ తేదీన విజయవాడ చేరుకుని ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రులతో భేటీ అవుతారని తెలిపారు. 7వ తేదీన నిర్వహించే కార్యక్రమానికి వినికిడి సమస్య ఉన్న ప్రతి ఒక్కరూ హాజరై, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



విజయదుర్గాభవానీదేవి ఆలయంలో కాత్యాయనీ దేవిగా



కాత్యాయనీ దేవిగా భ్రమరాంబ అమ్మవారు



యనమలకుదురు కనకదుర్గ అమ్మవారి ఆలయంలో..



ఈడుపుగల్లు ఆంజనేయస్వామి దేవస్థానంలో..



గన్నవరం యాదవుల రామాలయంలో..



శ్రీలక్ష్మీతిరుపతమ్మ ఆలయంలో..

కాత్యాయనీ.. కటాక్షించమ్మా !

- వైభవంగా దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు
- నాల్గవ రోజు కాత్యాయనీదేవిగా అమ్మవార్ల దర్శనం
- ఆలయాల్లో వెల్లివిరిసిన ఆధ్యాత్మిక శోభ



బందారుగూడెంలో పూజలు నిర్వహిస్తున్న భవానీలు



పోరంకి గంగానమ్మ గుడి వద్ద గాజుల అలంకరణ



ఐటీఐ రోడ్డులోని ఆలయంలో సామూహిక కుంకుమ పూజలో పాల్గొన్న మహిళలు

పెనమలూరు: గన్నవరం, పెనమలూరు నియోజకవర్గాల వ్యాప్తంగా దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా నాల్గవ రోజైన గురువారం అమ్మవార్లు కాత్యాయనీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. పలు ఆలయాలు, ఉత్సవ పందిళ్లలో విశేష పూజలు, అర్చనలు, హోమాలు నిర్వహించారు. ఉదయం నుంచే పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయాలకు తరలివచ్చి కాత్యాయనీదేవి కటాక్షించమ్మా అంటూ ప్రార్థించారు.

పెనమలూరు పరిధిలో..

పోరంకి గంగానమ్మ గుడి వద్ద అమ్మవారిని గాజుల అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. యనమలకుదురు శ్రీపార్వతీ సమేత శ్రీ రామలింగేశ్వరస్వామివారి ఆలయంలో అమ్మవారిని కూష్మాండదేవిగా అలంకరించి కుంకుమ పూజలు చేశారు. పెదపులిపాక విజయరాజరాజేశ్వరి ఆలయంలో, చోడవరం శ్రీ నాగేంద్రస్వామవారి ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు.

కంకిపాడు వ్యాప్తంగా..

కంకిపాడు: కాత్యాయనీదేవి.. కటాక్షించమ్మా అంటూ భక్తజనం అమ్మవారికి పూజలు చేయించారు. దేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా అమ్మవారు కాత్యాయనీదేవిగా భక్తులకు దర్శనమిచ్చి పూజలందుకున్నారు. కంకిపాడు, ఈడుపుగల్లు, ఉప్పలూరు, మద్దూరు, మంతెన తదితర గ్రామాల్లో అమ్మవారికి భక్తులు విశేష పూజా కార్యక్రమాలు జరిపించారు.

ఉయ్యూరులో..

ఉయ్యూరు: పెద ఓగిరాల, ఉయ్యూరు శివాలయం, విజయదుర్గా భవానీ దేవి ఆలయాల్లో కాత్యాయని దేవిగా దర్శనమిచ్చిన అమ్మవారిని భక్తులు పూజించి తరించారు.

కాత్యాయనీ దేవిగా పేరంటాలమ్మ

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో జరుగుతున్న దసరా ఉత్సవాలను పురస్కరించుకుని గురువారం అమ్మవార్లు శ్రీ కాత్యాయనీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. వేకువజామునే అమ్మవార్లను రకరకాల పుష్పాలతో దాతల సహకారంతో అలంకరించారు. గ్రామంతో పాటు చుట్టుపక్కల గ్రామాల భక్తులు అమ్మవార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఉదయం నుంచే అమ్మవార్లకు పలు ప్రత్యేక పూజలతో పాటు కుంకుమ పూజ, అష్టోత్తర శతనామార్చనలు, సహస్ర నామార్చనలు నిర్వహించారు.



కాత్యాయనీదేవి అలంకరణలో పేరంటాలమ్మ

గన్నవరంలో ఉత్సవాలు

గన్నవరం: శ్రీదేవి శరన్నవరాత్రుల్లో భాగంగా గురువారం శ్రీకాత్యాయనీదేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక శ్రీలక్ష్మీతిరుపతమ్మ ఆలయంలో కాత్యాయనీదేవికి పలువురు దంపతులచే పూజలు నిర్వహించారు. మహిళలు సామూహిక కుంకుమార్చనలు, శ్రీలలితా సహస్రనామ పారాయణం జరిపారు. స్థానిక శ్రీవేంకటేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీగాయత్రీదేవి అలంకరణలో అమ్మవారు పూజలందుకున్నారు. స్థానిక శ్రీగాయత్రి అమ్మవారి మందిరంలో శ్రీకాత్యాయనీ దేవికి పూజలు, శివపంచాక్షరీ హోమం జరిపారు. వాసవీమాత మందిరం, స్థానిక యాదవులపేట రామాలయంలో కుంకుమార్చనలు నిర్వహించారు.

అమ్మవార్లకు విశేష పూజలు..

హనుమాన్‌జంక్షన్‌రూరల్: స్థానిక నూజివీడు రోడ్డులోని లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం, ఐటీఐ రోడ్డులోని శ్రీభమరాంబ సమేత శ్రీశైల మల్లికార్జున స్వామి దేవస్థానం, ఏలూరురోడ్డులోని వాసవి కన్యకా పరమేశ్వరీ అమ్మవారి దేవస్థానాలతో పాటుగా మహాత్మాగాంధీనగర్, ఎన్టీఆర్ కాలనీ, బందారుగూడెంలో ప్రత్యేక ఉత్సవ మండపాల్లో విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారు కాత్యాయనీ దేవి అలంకరణలో దర్శనమిచ్చారు. అమ్మవారిని రకరకాల పూలతో విశేషంగా అలంకరించారు. లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం, శ్రీభమరాంబ సమేత శ్రీశైల మల్లికార్జున స్వామి ఆలయాల్లో మహిళలు సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు దేవస్థానానికి విచ్చేసి గాయత్రీదేవిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కాత్యాయనీదేవి అలంకరణలో దర్శనం

నున్న(విజయవాడరూరల్): నున్న శ్రీకనకదుర్గమ్మ దేవస్థానంలో జరుగుతున్న దసరా ఉత్సవాల్లో నాల్గవరోజైన గురువారం అమ్మవారు శ్రీ కాత్యాయనీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి విశేష పూజలు నిర్వహించిన అనంతరం హోమం, నివేదన, హారతి, మంత్రపుష్పం, తీర్థప్రసాదాల వితరణ చేపట్టారు.

దేవదాయశాఖకు చెందిన శ్రీ కాశీవిశ్వేశ్వరస్వామి దేవస్థానంలో అన్నపూర్ణాదేవి భక్తులకు కాత్యాయనీ దేవిగా దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు వచ్చి పూజలు చేశారు. చినకంచిలో శ్రీ కామాక్షి అమ్మవారు అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.



కంకిపాడులో కాత్యాయనీ దేవిగా..



ఉయ్యూరు శివాలయంలో..



నున్న కనకదుర్గమ్మ దేవస్థానంలో కాత్యాయనీదేవిగా..



ఉప్పలూరులో పూజలందుకుంటున్న దుర్గమ్మ తల్లి



మంతెనలో విశేష అలంకరణలో అమ్మవారు



మద్దూరులో పూజలందుకుంటున్న కాత్యాయనీ దేవి



ప్రొద్దుటూరు శివాలయంలో..

కార్మికుల పని గంటల పెంపుపై నిరసన



గన్నవరంలో నిరసన తెలుపుతున్న వామపక్ష నాయకులు

గన్నవరం: కార్మికుల పని గంటలు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో చేసిన తీర్మానానికి వ్యతిరేకంగా వామపక్షాల ఆధ్వర్యంలో గురువారం స్థానిక గాంధీబొమ్మ సెంటర్‌లో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వామపక్ష నేత కళ్లం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ...కార్మికుల పని గంటలను ప్రభుత్వం 8 నుంచి 13 గంటలకు పెంచడం అన్యాయమన్నారు. కార్మికుల హక్కులను కాలరాస్తూ పాలకులు ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకోవడం సరికాదన్నారు. రాత్రి వేళల్లో మహిళలు పనిచేయడం వల్ల వారికి రక్షణ ఉంటుందానని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. వామపక్ష నేతలు అనుమోలు వెంకటేశ్వరరావు, మల్లంపల్లి ఆంజనేయులు, నూతక్కి రామ్మోహన్, ఎం.విజయరావు, కై లే ఏసుదాసు, మిరప నాగేశ్వరరావు, గుండిమెడ ఉదయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలతో మహిళలపై పెరిగిన వేధింపులు



ఐద్వా సమావేశంలో మాట్లాడుతున్న స్వరూపారాణి

పెనమలూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాల కారణంగానే నేడు మహిళలు అనేక వేధింపులకు గురవుతున్నారని ప్రజాతంత్ర మహిళా సమాఖ్య(ఐద్వా) రాష్ట్ర పూర్వ కార్యదర్శి కె.స్వరూపారాణి ఆరోపించారు. యనమలకుదురులో గురువారం వీఎల్ భవన్‌లో ఐద్వా మండల 6వ మహాసభలో ఆమె పాల్గొని ప్రసంగించారు. నరేంద్రమోదీ నాయకత్వంలో ఉన్న కేంద్ర ప్రభుత్వం మనువాద సిద్ధాంతాన్ని అమలు చేసి మహిళలకు ఎలాంటి హక్కులు లేకుండా ఇంటికే పరిమితం చేసి పిల్లలు కనే యంత్రాలా మార్చారని విమర్శించారు. భారత రాజ్యాంగంలో మహిళలకు ఉన్న సమానత్వ హక్కులను కాలరాల్చారన్నారు. రాష్ట్రంలో చంద్రబాబునాయుడు మహిళల పట్ల దారుణంగా వ్యవహరిస్తున్నారని ఖండించారు. పని గంటలు పెంచి మహిళలను రాత్రి షిఫ్టుల్లో 10 నుంచి 13 గటంలు పని చేసే విధంగా చట్ట సవరణ చేశాడని మండిపడ్డారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలను మహిళలు చైతన్యవంతులై తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.

నూతన కమిటీ నియామకం

మండల ఐద్వా నూతన కమిటీని బుధవారం నియమించారు. అధ్యక్షురాలిగా షేక్ వలియా, కార్యదర్శులుగా పి.పాతాళలక్ష్మి, సభ్యులుగా జి.జయలక్ష్మి, శ్రీదేవి, ఎస్కే మీరాబి, సీహెచ్.భవాని, లక్ష్మీప్రసన్న, జోజిమేరి, కె.నాగమణి పలువురిని ఏకగ్రీవంగా నియమించారు.

రూరల్ మండలంలో పైపులైన్లకు లీకులు



విజయవాడరూరల్: లక్షలాది రూపాయలు ఖర్చు చేసి జలజీవన్ మిషన్‌లో నిర్మించిన పైపులైన్లకు లీకులతో గ్రామస్తులు అవస్థలు పడుతున్నారు. పాతపాడు గ్రామంలో కేంద్రప్రభుత్వం నిధులు, రాష్ట్ర ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంటు 53 లక్షల రూపాయలతో బోర్లు, పైపులైన్లు నిర్మించి రెండేళ్లు కాకముందే పైపులైన్ల లీకులతో ప్రజలకు నీటి సరఫరా సరిగా లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పాతపాడు గ్రామంలో బోర్లు నిర్మించిన ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు గ్రామ శివారు గ్రామాలైన అప్పారావుపేట, సీతారామపురం, మంగళాపురం గ్రామాల్లో రోడ్డు పైనే పైపులైన్లు నిర్మించారు. నాణ్యత లోపంగల పైపులైన్లు వేయడంతో తరుచూగా జాయింట్లు వద్ద లీకు కావడం, కొన్ని చోట్ల పైపులన్ విరిగిపోవడం జరుగుతుందని దీంతో నీటిసరఫరాకు అంతరాయం ఏర్పడుతోంది. ఈ విషయాన్ని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు గ్రామ పంచాయతీ అధికారులు తెలియచేసినా పట్టించుకోవడం లేదంటున్నారు. గ్రామ పంచాయతీ తరుచూగా పైపులైన్లకు వెల్డింగ్ పెట్టి రిపేర్లు చేయాల్సి వస్తుందని సిబ్బంది చెబుతున్నారు. ఇదే పరిస్థితి సమీపంలోని నైనవరం గ్రామంలోనూ ఉందని ఆ గ్రామస్తులు అంటున్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పైపులైన్లకు శాశ్వత మరమ్మతులు చేపట్టాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి



పోరంకిలో రోడ్లు ఊడుస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్, కమిషనర్ నజీర్ తదితరులు



ఈడుపుగల్లు సెంటరులో రోడ్లు శుభ్రం చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

పెనమలూరు: ప్రజలు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ సూచించారు. పోరంకి గ్రామంలో గురువారం స్వచ్ఛతాహి సేవ-2025 ఏక్ దిన్ ఏక్ గంట ఏక్‌సాత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే ప్రసాద్, తాడిగడప మున్సిపాలిటీ కమిషనర్ షేక్.నజీర్, మున్సిపాలటీ సిబ్బంది, స్థానికులు శ్రమదానం చేశారు. ఉడా పార్కు వద్ద పిచ్చి మొక్కలు తొలగించారు. ప్రధాన రహదారులు చీపురులతో ఊడ్చి శుభ్రం చేశారు. పరిసరాల శుభ్రత అవసరాన్ని వెల్లడించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ కిరణ్, మెప్మా సిబ్బంది, మున్సిపల్ ఉద్యోగులు, స్థానికులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీ పరిధి పోరంకి వినాయకుడి గుడి వద్ద రోడ్డు నిర్మాణానికి గురువారం ఎమ్మెల్యే బోడె ప్రసాద్ శంకుస్థాపన చేశారు. గ్రామంలో తూముల సెంటర్‌లో వినాయకుడి గుడి రోడ్డును మున్సిపాలిటీ నిధులు రూ.30 లక్షలతో 150 మీటర్ల పొడవున సీసీ రోడ్డు నిర్మిస్తున్నామన్నారు. అంతర్గత రోడ్లకు నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అనుమోలు ప్రభాకరరావు, రత్నకుమారి, గోపీచంద్, సంగెపు రంగారావు పాల్గొన్నారు.

ఈడుపుగల్లులో పరిసరాల పరిశుభ్రత కార్యక్రమం

కంకిపాడు: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ పి.అనూష సూచించారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా గురువారం ఈడుపుగల్లు సెంటర్‌లో పరిసరాల పరిశుభ్రత కార్యక్రమం చేపట్టారు. ఎంపీడీఓ పి.అనూష మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవటం ద్వారా వ్యాధులు దరిచేరవన్నారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను పూర్తి స్థాయిలో వినియోగంలోకి తేవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ పి.ఇందిర, ఈఓఆర్‌డీ కిరణ్మయి, ఈఓ చింతా కిరణ్‌కుమార్, పందిపాటి సుధాకర్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో అవినీతిపై విచారణ ప్రారంభం

పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీలో అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న పూర్వ కమిషనర్‌గా పని చేసిన ఎం.వెంకటేశ్వరరావు, అసిస్టెంట్ టౌన్ ప్లానింగ్ అధికారి బి.మురళీగౌడ్, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ వై.పద్మావతిని గురువారం మంగళగిరిలోని డైరెక్టర్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్‌లో విచారణ అధికారి ప్రసాద్ విచారించారు. అయితే దసరా విధుల నిర్వహణ కారణంగా ఏసీపీ మురళీగౌడ్ విచారణకు రాలేదు. మిగితా ఇద్దరు విచారణకు హాజరయ్యారు. గతంలో కానూరులో నిబంధనలకు విరుద్ధంగా భవన నిర్మాణ ప్లాన్‌లు జారీ చేశారని పూర్వ కమిషనర్ వెంకటేశ్వరరావు, మరో ఇద్దరు టౌన్ ప్లానింగ్ అధికారులపై ఫిర్యాదు అందింది. దీంతో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ విచారణకు ఆదేశించారు. దీంతో విచారణ అధికారి జీవీజీఎస్‌వీ ప్రసాద్ గురువారం విచారణ చేపట్టారు. అధికారులపై వచ్చిన ఆరోపణల వివరణ ఇవ్వాలని విచారణ అధికారి ఆదేశించారు. విచారణకు హాజరైన అధికారులు తమకు వారం రోజులు గడువు ఇవ్వాలని కోరారు. దీంతో విచారణ అధికారి వారం రోజుల గడువుకు అంగీకరించారు.

హనుమాన్ దేవస్థానానికి డిజిటల్ గడియారం బహూకరణ

హనుమాన్‌జంక్షన్‌రూరల్: స్థానిక ప్రసిద్ధ అభయాంజనేయ స్వామి దేవస్థానానికి భగవద్గీత డిజిటల్ గడియారాన్ని శ్రీరామ నవమి ఉత్సవ కమిటీ గురువారం బహూకరించింది. హనుమంతునికి ప్రత్యేక పూజలు నిర్వహించిన ఉత్సవ కమిటీ సభ్యులు గడియారాన్ని ఆలయ అధికారులు, అర్చకులకు అందజేశారు. ప్రతి గంటకు సమయంతో పాటు భగవద్గీత శ్లోకం, తెలుగు తాత్పర్యం గడియారం చెబుతుందని దాతలు తెలిపారు. ఉత్సవ కమిటీ సభ్యులు తవ్వా పూర్ణచంద్రరావు, నూకల బాలాజీ, వడ్డి విజయ్, నూకల రాఘవరావు, మంచెం రాఘవ, అంకమ్మరావు, సత్యమణి పాల్గొన్నారు.

సుస్థిర ప్రణాళికతో అభివృద్ధి లక్ష్యాలు సాధించాలి

కంకిపాడు: సుస్థిర ప్రణాళికతో అభివృద్ధి లక్ష్యాలు సాధించాలని ఎంపీడీఓ పి.అనూష సూచించారు. సుస్థిర అభివృద్ధి ప్రణాళికలపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన రెండు రోజుల పాటు నిర్వహించిన శిక్షణా కార్యక్రమాలు గురువారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఎంపీడీఓ అనూష మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలన్నారు. లక్ష్యాలను నిర్దేశించుకుని ప్రణాళికతో పనిచేయాలని, సమన్వయంతో వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమంలో ఈఓఆర్‌డీ కిరణ్మయి, పలువురు మండలస్థాయి అధికారులు, కంకిపాడు, పెనమలూరు, తోట్లవల్లూరు మండలాలకు చెందిన ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఫార్మసిస్టుల పాత్ర కీలకం

లబ్బీపేట(విజయవాడతూర్పు): వైద్య రంగంలో ఫార్మసిస్టుల పాత్ర కీలకమైనదని ఏపీ ఫార్మసీ కౌన్సిల్ రిజిస్ట్రార్ డాక్టర్ విలియమ్ కేరి అన్నారు. ప్రపంచ ఫార్మసిస్టుల దినోత్సవం సందర్భంగా గురువారం సిద్ధార్థ ఫార్మసీ కళాశాలలో సదస్సు, ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన విలియం కేరి మాట్లాడుతూ ఫార్మసీ రంగంలో పరిశోధనలపై విద్యార్థులు దృష్టి సారించాలన్నారు. విద్యార్థులకు వివిధ మెడికల్ విభాగాల్లో మెరుగైన వైద్యంలో ఫార్మసిస్టుల పాత్రను తెలియచేసే నమూనా రూపకల్పన పోటీ నిర్వహించారు. విద్యార్థులు అధునాతన సదుపాయాలతో రోగులకు ఫార్మసిస్టు సేవలను వివరిస్తూ 20 నమూనాలు ప్రదర్శించగా, నెఫ్రాలజీలో మేఘమాల బృందం ప్రదర్శించిన నమూనా మొదటి బహుమతికి ఎంపికైంది.

జగనన్న కాలనీల్లో దొంగల బెడద

పెనమలూరు: వణుకూరు జగనన్న కాలనీలోని లే అవుట్లలో దొంగలతో నివాసితులు బెంబేలెత్తి పోతున్నారు. రాత్రి సమయాల్లో అనుమానితులు సంచరిస్తున్నా పోలీసులు చర్యలు తీసుకోవటం లేదని నివాసితులు వాపోతున్నారు. వణుకూరు జగనన్న కాలనీలోని పలు లేఅవుట్లలో నివాసితులు గృహాలు నిర్మాణం చేసుకోని నివశిస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత జగనన్న కాలనీలను నిర్లక్ష్యం చేసింది. వీధి దీపాలు వేయకపోవటంతో రాత్రి వేళల్లో అసాంఘిక శక్తులు, దొంగలు సంచరిస్తున్నారు. ఇళ్లకు తాళాలు వేస్తే తలుపులు, కిటికీలు ధ్వంసం చేస్తున్నారు. ఇంటి ముందు వాహనాలు పార్కు చేస్తే చోరీ చేస్తున్నారు. వీఎంసీ లేఅవుట్ వద్ద బుధవారం సాంబశివరావు అనే వ్యక్తి తన బైక్ ఇంటి ముందు ఉంచగా గుర్తు తెలియని దొంగలు దొంగిలించారు. జగనన్న కాలనీలో గస్తీ ఏర్పాటు చేయాలని జిల్లా ఎస్పీ దృష్టికి గతంలో స్థానికులు తీసుకువెళ్లినా నేటికి చర్యలు తీసుకోలేదని నివాసితులు వాపోతున్నారు. ఇకనైనా జగనన్న కాలనీల్లో రాత్రి గస్తీ పెంచాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

క్రేన్ ఢీ కొని పంచాయతీ కార్మికునికి గాయాలు



నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామ పంచాయతీ కార్యాలయంలో నీటి సరఫరా విభాగంలో కాంట్రాక్ట్ కార్మికునిగా పని చేస్తున్న జూనపూడి కోటేశ్వరరావు(55) అనే వ్యక్తి క్రేన్ ఢీ కొని తీవ్ర గాయాలైన సంఘటన గురువారం చెరువు సెంటర్‌లో జరిగింది. ప్రత్యక్ష సాక్షుల కథనం మేరకు నీళ్ల మోటార్లు ఆన్ చేసి రంగా బొమ్మ సెంటర్ వైపు నుంచి సైకిల్‌పై వస్తున్న కోటేశ్వరరావును శ్రీ గణేష్ క్రేన్ సర్వీస్‌కు చెందిన క్రేన్ వెనుక నుంచి ఢీ కొట్టింది. దీంతో గ్రామ పంచాయతీ సిబ్బంది కోటేశ్వరరావును చికిత్స నిమిత్తం ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. సమాచారం అందుకున్న నున్న పోలీసులు కేసు నమోదు చేశారు.